
రంజాన్ వేళలు

	ఇఫ్తార్(సోమవారం)	సహారి(మంగళవారం)
కర్నూలు	6:35 (సాయంత్రం)	4:55 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:32 (సాయంత్రం)	5:08 (ఉదయం)
ఆదోని	6:36 (సాయంత్రం)	4:56 (ఉదయం)



జగన్ గొప్పేముంది..!

- ముందు చూపుతో ముచ్చుమర్రి లిఫ్టు నిర్మించిన చంద్రబాబు
- చిన్న పనులు కూడా చేయకుండా అటకెక్కించిన జగన్
- ముచ్చుమర్రి మరో పట్టిసీమ అని వైసీపీ నేతలకు తెలుసా?
- రాయలసీమకు ఏం చేశారని జనం ముందుకు వస్తారు?

సీఎం జగన్ గొప్పల గురించి వైసీపీ నాయకుల ప్రచార ఆర్భాటానికి అంతే లేకుండా పోయింది. ఇంతకూ రాయలసీమకు జగన్ ఏం చేశారు? నిర్దిష్టంగా ఏ అభివృద్ధి పనులు చేయకుండానే గత టీడీపీ ప్రభుత్వం చేసిన పనులను తానే చేసినట్లు చెప్పుకుంటున్నారు. దీనికి తాజా ఉదాహరణ ఇటీవల చిత్తూరు జిల్లా కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీనీవా నీటిని విడుదల చేసి, అదంతా తన ఘనతే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకున్నారు. గత సీఎం చంద్రబాబు ఈ పని చేయలేకపోయారని విమర్శలు గుప్పించారు. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తికి ఇలా అబద్ధాలు చెప్పడం తగునా? అని సీమ జనం ఆశ్చర్యపోయారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను యుద్ధ ప్రాతిపదికన అప్పటి సీఎం చంద్రబాబు పూర్తి చేసి 2017 జనవరి 2న శ్రీశైలం జలాశయం నీటిని హంద్రీనీవా కాలువకు విడుదల చేశారు. ఆ నీరే ఇప్పుడు కుప్పం బ్రాంచ్ కాలువలో ప్రవహిస్తున్నది. ఇదంతా చేసింది గత టీడీపీ ప్రభుత్వం. ఇందులో వైఎస్ జగన్ ఘనత ఏముంది? ఈ సంగతి ప్రజలకు తెలుసు. కానీ జగన్ ఈ అభివృద్ధినంతా తన ఖాతాలో వేసుకోడానికి వెనుకాడటం లేదు.

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 24: రాయలసీమ అభివృద్ధి మీద చంద్రబాబునాయుడికి సంపూర్ణమైన అవగాహన ఉంది. దాన్ని అమలు చేసే క్రమంలోనే ముచ్చుమర్రి లిఫ్ట్‌ను నిర్మించారు. దీని వల్ల రాయలసీమకు పుష్కలంగా నీరు అందుతోంది. సీమ ప్రజలు ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అభినందనల వర్షం కురిపించారు. శ్రీశైలం జలాశయం నీటిని ముచ్చుమర్రి లిఫ్టు స్కీం నుంచి హంద్రీనీవా కాలువకు విడుదల చేసి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీటిని అందించే బృహత్తర పథకాన్ని చంద్రబాబు పూర్తి చేశారు. ఈ ఘనత పూర్తిగా చంద్రబాబుకే దక్కుతుంది. ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను ముందు చూపుతో గత టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయకపోయి ఉంటే.. ఈరోజు శ్రీశైలం జలాశయం నీరు హంద్రీనీవా కాలువ ద్వారా రాయలసీమకు అందించే పరిస్థితి ఉండేది కాదని నీటి పారుదల శాఖ అధికారులు కూడా చెబుతున్నారు. నిజంగా రాయలసీమపై ఏ మాత్రం అభిమానం జగన్‌కు ఉండి ఉండింటే ఎంతో ప్రాధాన్యత ఉన్న ముచ్చుమర్రి లిఫ్టు స్కీంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రద్ధ పెట్టి ఉండేవారు. ఆయన తన పాలనాకాలం ముగిసిపోయిందే గాని, ముచ్చుమర్రి లిఫ్ట్ పనులను కనీసంగా పట్టించుకోలేదు. ఇది రాయలసీమ మీద వైసీపీ చిత్తశుద్ధికి నిదర్శనం అని రైతులు అంటున్నారు.



● ముచ్చుమర్రి వల్లనే కుప్పం బ్రాంచ్ కాలువకు నీరు


శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతున్న సమయంలో ఆ నీటిని రాయలసీమకు హంద్రీనీవా కాలువ ద్వారా పంపేందుకు ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను సుమారు రూ.387 కోట్లతో 16 పంపులతో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. ఈ 16 పంపుల్లో నాలుగు పంపులతో కేసీ కెనాల్‌కు, 12 పంపుల ద్వారా హంద్రీనీవా కాలువకు నీరు విడుదల చేయాలని టీడీపీ ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైలం జలాశయంలో వెనుకతట్టు జలాలను ముచ్చుమర్రి పంప్ హౌస్‌వద్దకు చేర్చేందుకు రూ.54 కోట్లతో అప్రోచ్ కెనాల్ పనులను ఆనాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. ఈ సంవత్సరం రెండు నెలలపాటు ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ద్వారానే కేసీ కెనాల్‌కు, హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయడం వల్ల కెసీ ఆయకట్టులో పంటలు సాగయ్యాయి. హంద్రీనీవా కాలువకు ముచ్చుమర్రి లిఫ్టు స్కీం నుంచి నీటిని విడుదల చేయడం వల్ల తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న డోన్, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందాయి. ఈ లిఫ్టు ప్రారంభోత్సవంలో చంద్రబాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేంత వరకు పట్టిసీమ లిఫ్టు స్కీం ఏ విధంగా ఉపయోగపడుతుందో.. అదే విధంగా ముచ్చుమర్రి లిఫ్టు స్కీం కూడా శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినప్పుడు ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ద్వారా కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీరు అందిస్తుందని అన్నారు. ముచ్చుమర్రి మరో పట్టిసీమగా రాయలసీమకు ఉపయోగపడటం తథ్యమని ప్రకటించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నీటి పారుదల నిర్మాణాలను ఏ ప్రభుత్వం అభివృద్ధి చేసినా అభినందించే సంస్కృతిని వైఎస్ జగన్ రెడ్డి మరిచిపోయారని, అందుకే పెండింగ్ పనులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తు న్నారు. ముచ్చుమర్రి లిఫ్టు స్కీం వల్లే కుప్పంకు తన చేతుల మీదుగా నీరందించే అవకాశం దక్కిందనే సంగతి మరిచి పోయి, చంద్రబాబును విమర్శించడం దారుణమని రాయలసీమ ప్రజలు అంటున్నారు. ముచ్చుమర్రి మరో పట్టిసీమ అని వైసీపీ నాయకులకు తెలిస్తే బాగుండని అంటున్నారు.



2017లో సీఎం హోదాలో చంద్రబాబు ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను ప్రారంభిస్తున్న దృశ్యం

డెడ్ స్టోరేజీలో కూడా కేసీ కెనాల్, హంద్రీ నీవా కాలువకు నీరు

శ్రీశైలం జలాశయంలో ఈ సంవత్సరం గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి నిల్వలు రెండు నెలల కిందే తగ్గిపోవడం మొదలైంది. తుంగభద్ర జలాశయంలో కూడా నీటి నిల్వలు కూడా తగ్గిపోయి ఎల్లెల్సీతో పాటు 2.65 లక్షల ఎకరాలకు సాగునీరందించే కేసీ కెనాల్‌కు కూడా నీరు విడుదలయ్యే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ద్వారా శ్రీశైలం జలాశయంలో డెడ్ స్టోరేజీకి నీటి నిల్వలు తగ్గినా అంటే 789 అడుగుల వద్దకు నీరు చేరినా.. ముచ్చుమర్రి నుంచి నీటిని కేసీ కెనాల్‌తో పాటు హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసే అవకాశం కలిగింది. కేసీ కెనాల్‌కు రెండు పంపుల ద్వారా గత రెండు నెలల నుంచి అధికారులు నీరు అందిస్తున్నారు. అదేవిధంగా హంద్రీనీవా కాలువ ద్వారా మల్యాలకు పంపి అక్కడ లిఫ్టు నుంచి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలోని కుప్పానికి నీటిని అందిస్తున్నారు. ఆదివారం రోజున శ్రీశైలం జలాశయంలో 810.80 అడుగుల వద్ద నీటి నిల్వలు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ముచ్చుమర్రి లిఫ్టు స్కీం లేకుంటే... వేసవి కాలంలో శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి పడిపోయిన సమయంలో అటు కేసీ కెనాల్‌కు, ఇటు హంద్రీనీవా కాలువకు నీటిని అందించే అవకాశమే లేకుండా పోయేదని నీటి పారుదల శాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.



శ్రీశైలం జలాశయంలో పడిపోయిన నీటి నిల్వలు

రాయలసీమ ద్రోహి.. జగన్



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమపై కపట ప్రేమ మాత్రమే చూపిస్తున్నారు. కరువు పరిస్థితులు నివారించేందుకు హంద్రీనీవా ప్రాజెక్టుకు కేవలం రూ.150 కోట్లు ఇస్తే.. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో 40వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే.. జగన్మోహన్ రెడ్డి ఈ నిధులను కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. అదే విధంగా ముచ్చుమర్రి లిఫ్టు స్కీం పెండింగ్ పనులను పూర్తి చేయలేదు.

- వై. నాగేశ్వరరావు యాదవ్, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్

ముచ్చుమర్రి పెండింగ్ పనుల పూర్తిపై శ్రద్ధ ఏదీ...?

మరో పట్టిసీమగా గుర్తింపు పొందిన ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ప్రాజెక్టుకు 16 పంపులను ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే విధంగా శ్రీశైలం జలాశయం నుంచి ముచ్చుమర్రి పంప్‌హౌస్ వద్దకు నీటిని మళ్లించేందుకు 6 కి.మీల దాకా అప్రోచ్ కెనాల్‌కు గత టీడీపీ హయాంలో రూ.387 కోట్ల నిధులను కేటాయించింది. అయితే పెండింగ్ పనులు పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడం లేదనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. అప్రోచ్ కెనాల్ 6 కి.మీల మేర తవ్వాల్సి ఉండగా.. వివిధ కారణాల వల్ల ఈ పనులను ఐదేళ్లు కావస్తున్నా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. 16 పంపులకు గాను 4 పంపులను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపి ముచ్చుమర్రి లిఫ్టు స్కీం పెండింగ్ పనులు పూర్తి చేసి రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు.

నమో నారసింహా...

- ఎగువ అహోబిలంలో ఘనంగా జ్వాలా నృసింహుడి రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- నేడు దిగువ అహోబిలంలో తేరు



ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి రథోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడు

నంద్యాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహం... గోవిందనామస్మరణల నడుమ... జయజయధ్వానాల మధ్య నేత్రపర్వంగా ఎగువ అహోబిలం జ్వాలా నరసింహస్వామి రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. ముందుగా జ్వాలా నరసింహస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామివార్లను రథంపై అధిష్ఠించారు. రథయాజ్ఞీకులు, రథారూఢులైన శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామివారికి హారతులు ఇచ్చారు. అనంతరం భక్తుల జయజయధ్వనుల నడుమ రథాన్ని ముందుకు సాగించారు. భక్తులు భక్తి పారవశ్యంతో రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఇదిలా ఉండగా దిగువ అహోబిలంలో ఆదివారం ప్రహ్లాదవరదస్వామికి కాళింగనర్తనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అభిషేకం, తొట్టితిరుమంజనం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. రాత్రి ప్రహ్లాదవరదస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు దిగువ అహోబిలంలో

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దిగువ అహోబిలంలో రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. అదేవిధంగా ఎగువ అహోబిలంలో ద్వాదశారాధనం పుష్పయాగోత్సవంతో పాటు రాత్రి గరుడోత్సవం, ధ్వజారోహణం వేడుకలను నిర్వహిస్తారు.



పటిష్ట తనిఖీలు చేపట్టండి

- అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచాలి
- చెక్‌పోస్టులను తనిఖీ చేసిన కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు

కర్నూలు, మార్చి 24: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జాతీయ రహదారులపై వాహనాలను పటిష్ఠంగా తనిఖీ చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దున ఉన్న కర్నూలు పంచలింగాల చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తరలించే నగదు, మద్యం, ఇతర కానుకల రవాణాలను అరికట్టాలన్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు లభ్యమైతే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తెల్లని టోపీలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సంబంధిత పోలీసు అధికారులను డీఐజీ ఆదేశించారు. డీఐజీ వెంట కర్నూలు తాలుకా సీఐ శ్రీధర్, ఎస్ఐ పీరయ్య, సెబ్, కమర్షియల్ ట్యాక్స్, ఆర్టీఓ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐజీ విజయరావు

చెత్తలో 'ఎపిక్ కార్డులు'

- నిర్లక్ష్యంగా పడేసిన ఓటరు కార్డులు
- విమర్శలు రావడంతో తీసుకెళ్లిన అధికారులు

తుగ్గలి, మార్చి 24: ఓట్లు జీవితాన్ని మారుస్తాయనీ గొంతెత్తి అధికారులు చెబుతుంటే.. ఓటు వేయడానికి ముఖ్యమైన ఓటరు కార్డులను అధికారుల నిర్లక్ష్యంతో చెత్తపాలవుతోంది. తుగ్గలి మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామ శివారులోని వంకలో బొందిమడుగుల గ్రామానికి సంబంధించిన ఓటరు కార్డులను ఇలా వంకలో పడేశారు. బొందిమడగుల రెవెన్యూ పరిధిలోని దాదాపు 70కి పైగా ఓటరు కార్డులను వంకలో పడేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని ఆ ఓటరు కార్డులను సేకరించి పత్తికొండ ఆర్డీఓ కార్యాలయానికి చేర్చారు. ఓటరు ఎపిక్ కార్డు, ఓటు హక్కుపై స్వీప్ పేరుతో నిత్యం అధికారులు అవగాహన కల్పిస్తుంటే మండలంలో మాత్రం ఇలా ఓటరు కార్డులను చెత్తపాలు చేశారు. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై వీఆర్వో, తహసీల్దార్లను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్‌కాల్‌లో ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.



బొందిమడుగుల గ్రామ శివారు వంకలో పడవేసిన ఓటరుకార్డులు



తుంగభద్రలో ఇసుక తోడేళ్లు

- తెల్లారే దాకా ఇసుక ట్రాక్టర్ల ద్వారా తరలింపు
- మామూళ్ల మత్తులో అధికారులు?
- చెలరేగిపోతున్న ఇసుక బకాసురులు



సాతనూరు సమీపంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

కోసిగి, మార్చి 24: తుంగభద్ర ఇసుక తోడేళ్ల బారినపడి విలవిలలాడుతోంది. నదిలో నీరు లేక ఎడారిగా మారడంతో.. కొందరు యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. కోసిగి మండల పరిధిలోని సాతనూరు సమీపంలో సుమారు కోసిగి, జంపాపురం, ఐరంగల్, దుద్ది, సాతనూరు గ్రామాలకు చెందిన ట్రాక్టర్లతో తుంగభద్రనదిలోని ఇసుకను అధికార పార్టీ నాయకులు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని సాతనూరు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు కోసిగికి చెందిన 20 ట్రాక్టర్లు రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజాము ఐదారు గంటల వరకు ఇసుకను తరలిస్తున్నారని, ట్రాక్టర్ల శబ్దాలకు రాత్రిళ్లు నిద్ర రావడం లేదని సాతనూరు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెబ్, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు, అధికారులతో చనువుగా ఉండటంతో వారి ఆగడాలకు అంతే లేకుండా పోయిందని అంటున్నారు. ఒక ఇసుక ట్రాక్టర్ మార్కెట్‌లో రూ.4వేలకు అమ్ముకుంటూ రోజుకు వేలల్లో సంపాదిస్తున్నారని, అధికారులు తుంగభద్ర నుంచి అక్రమ ఇసుక తరలింపుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లీజ్... అలక వీడండి..!

- అసంతృప్తికి లోనైన వారికి వైసీపీ బుజ్జగింపు
- అధిష్ఠానం భరోసా ఇస్తే ఆలోచిస్తా : వై. రుద్రగౌడు

ఎమ్మిగనూరు, మార్చి 24: ఎమ్మిగనూరు వైసీపీలో లుకలుకలపై వైసీపీ దృష్టి సారించింది. మొదటి నుంచి టికెట్ కేటాయింపుపై అసంతృప్తిగా ఉన్నవారిని చల్లబరిచేందుకు వైసీపీ దిగివస్తోంది. అసంతృప్తికి గురైనవారిని బుజ్జగించేందుకు వైసీపీ జిల్లా కో. ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి రంగంలోకి దిగారు. వైసీపీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి విఫలమైన వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వై. రుద్రగౌడును ఆదివారం ఆయన స్వగృహంలో వైసీపీ జిల్లా కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్సీ మధుసుదన్‌లు కలిశారు. సీఎం జగన్ సభకు రావాలని వారు రుద్రగౌడును కోరారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన రుద్రగౌడుకు వైసీపీ మొండి చేయిచూపింది. చివరకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని బతిమిలాడినా ఆయన మొహం చాటేశారు. తనకు కాదని మాజీ ఎంపీ బుట్టారేణుకను తెరపైకి తీసుకువచ్చి టికెట్ ఇవ్వడంపై రుద్రగౌడు రగిలిపోతున్నారు.

సీఎం పర్యటన కోసమేనా..?

అయితే ఇన్నిరోజులూ గుర్తుకు రాని రుద్రగౌడు ఒక్కసారిగా వైసీపీ కీలక నేతలకు గుర్తుకొచ్చాడు. లింగాయత్ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతంలో ఆ సామాజిక వర్గానికి చెందిన రుద్రగౌడును బుజ్జగిస్తోంది వైసీపీ. ఈనెల 29న సీఎం జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మిగనూరులో జరిగే సిద్ధం సభకు వస్తుండడంతో పార్టీకి దూరంగా ఉన్న వారిని సభకు రప్పించేందుకు ఆ పార్టీ జిల్లా నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి రుద్రగౌడుతో సమావేశమయ్యారు. అలక వీడాలని జగన్ సభకు రావాలంటూ కోరినట్లు సమాచారం. అయితే రుద్రగౌడు మాత్రం 'పార్టీ అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో మా నాయకులకు, కార్యకర్తలకు ఏమీ చేసుకోలేకపోయాం. ఎన్నికల్లో కష్టపడి గెలిపిస్తే మమ్మల్ని మాట్లాడించకుండా మూలకు కూర్చోబెట్టారు. ఇప్పుడు కూడా నేను..మా అనుచరులు, నాయకులు, కార్యకర్తలు పనిచేస్తే రాబోయే రోజుల్లో ఇదే పరిస్థితి ఎదురుకాదని గ్యారెంటీ ఏంటి..' అని గట్టిగానే ప్రశ్నించినట్లు సమాచారం. అధిష్ఠానం నుంచి స్పష్టమైన భరోసా ఇస్తే ఆలోచిస్తామని చెప్పినట్లు తెలిసింది. దీంతో గౌడుతో సమావేశమైన నాయకులు ఒకట్రెండు రోజుల్లో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పి వచ్చినట్లు సమాచారం.



ఈనెల 29న ఎమ్మిగనూరుకు సీఎం జగన్ రాక

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న రాష్ట్ర సీఎం జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరుకు రానున్నారు. ఈ మేరకు ఆదివారం ఆపార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బుట్టా రేణుక, బీవై రామయ్య సభ నిర్వహించే వీవర్స్ కాలనీలోని మైదానాన్ని పరిశీలించారు.

కుంగిన రహదారికి తల్లి బలి

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- అమ్మప్రేమ దూరమైన చిన్నారులు



చిన్నారి చందనతో మృతురాలు పావని(ఫైల్)



యామిని



శివాని

రుద్రవరం, మార్చి 24: కుంగిన ఆర్‌అండ్‌బి రహదారికి ఓ తల్లి బలైంది. ముగ్గురు చిన్నారులకు అమ్మప్రేమను దూరం చేసింది. కుంగిన రోడ్డుపై జరిగిన ప్రమాదంలో మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన ఓ మహిళ మృతి చెందింది. రుద్రవరం గ్రామానికి చెందిన యాగంటి భార్య పావని (21) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందింది. ఈ నెల 22న మహానందిలో జరిగే బంధువుల వివాహానికి యాగంటి తన భార్యపావనితో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చిన్నకంబలూరు మెట్ట కాశిరెడ్డినాయన ఆశ్రమం సమీపంలో బైక్ అదుపుతప్పి ఒక్కసారిగా కిందకు పడిపోయింది. దీంతో వాహనంపై ఉన్న పావని కొద్ది దూరం ఎగిరిపడి తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ పావని చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఇదిలా ఉండగా ఘటన జరిగిన ప్రాంతంలో రోడ్డు కుంగడంతో ప్రమాదం చోటు చేసుకుంది. మృతురాలి పావని తల్లి నాగేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాలన్న తెలిపారు. కాంట్రాక్టర్లు రహదారిని వేసేక్రమంలో సక్రమంగా రోలింగ్ చేయకపోవడంతోనే రహదారి కుంగినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు రహదారి ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

చిన్నారులకు అమ్మ ప్రేమ దూరం

యాంగటి, పావనిలకు మూడేళ్ల వయసు కలిగిన యామిని, శివాని బుడిబుడి నడకలతో అడుగులు వేస్తున్నారు. చందన అనే ఐదు నెలల చిన్నారి కూడా ఉంది. ఊహ తెలిసే లోపే ఈ ముగ్గురికీ అమ్మప్రేమ దూరమైంది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తరుణంలో రోడ్డు ప్రమాదం తల్లిని బలి తీసుకుంది. చిన్నారుల ఆలనా పాలనా ఎలా అని బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. రుద్రవరం గ్రామానికి చెందిన యాగంటికి శిరివెళ్లకు చెందిన పావనితో ఐదేళ్లక్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒకే కాన్పులో ఇద్దరు కవల ఆడపిల్లలు, రెండో కాన్పులో మరో ఆడపిల్ల జన్మించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో ఆ చిన్నారులకు తల్లిని దూరం అయింది.



చిన్నకంబలూరు మెట్ట సమీపంలో కృంగిన రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మట్టిసంచులు

పశుసంవర్ధక శాఖ జేడీగా శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 24: కర్నూలు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీగా పని చేస్తున్న రామచంద్రయ్య ఈ నెల 31న పదవి విరమణ చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆయన స్థానంలో జేడీగా తూర్పు గోదావరి జిల్లా మండపేట పశుసంవర్ధకశాఖ శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఇన్‌చార్జి ఎస్ఈ సురేంద్రబాబు సస్పెన్షన్ కొనసాగింపు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: నగర పాలక సంస్థలో ఇన్‌చార్జి ఎస్‌ఈగా విధుల నిర్వహిస్తూ ఏసీబీకి పట్టుబడిన సురేంద్రబాబును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. 2022 జూలై 1న రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే తన సస్పెన్షన్ ఎత్తివేయాలని సురేంద్రబాబు ఫిబ్రవరి 27న ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ మేరకు ఏసీబీ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు సస్పెన్షన్ కొనసాగించాలని ప్రభుత్వం ఆదివారం మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు సస్పెన్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీకి ఆదేశాలు జారీ చేశారు.

ట్యాంకర్-కారు ఢీ : ఒకరి మృతి

మల్లన్న దర్శనానికి వెళ్తుండగా ఘటన



పాములపాడు గ్రామ శివార్లలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవిరెడ్డి

పాములపాడు, మార్చి 24: శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు సంతోషంగా బయల్దేరిన ఆ కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది. స్వామిదర్శనార్థం వెళ్తుండగా పాములపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీంద్ర రెడ్డి(36) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం కర్నూలుకు చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి శ్రీశైలం క్షేత్రానికి కారులో బయలుదేరారు. పాములపాడు రుద్రవరం గ్రామాల మధ్యలో కేజీ రోడ్డుపై కర్నూలు వైపు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో కారు నడుపుతున్న రవీంద్ర రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సింధూజ, కుమార్తెలు చైత్రిక, లోహిత, తల్లిదండ్రులు రామసింహారెడ్డి, రామకృష్ణమ్మ కూడా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే సంఘటనా స్థలానికి ఎస్ఐ అశోక్ తన సిబ్బందితో చేరుకొని గాయపడ్డవారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సల నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల అధ్యక్షుడిగా నాగేంద్రప్ప

నంద్యాల టౌన్, మార్చి 24: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కె.నాగేంద్రప్ప ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాగేంద్రప్ప జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్ సూర్యనారాయణ జిల్లా కమిటీతో మాట్లాడి నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సలహాలు, సూచనలకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నాగేంద్రప్ప పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, తిరుపాలయ్య, సునీల్‌కుమార్, పట్టణ అధ్యక్షులు సత్యం, శ్రీహరి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కార్యకర్తలకు శిక్షణ అవసరం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు

కర్నూలు(కల్చరల్), మార్చి 24: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ)లోని అన్ని విభాగాల కార్యకర్తలకు శిక్షణ అవసరమని వీహెచ్‌పీ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీ లోగల వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీహెచ్‌పీ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీహెచ్‌పీ బలోపేతానికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో సమితులను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ సంస్థాగతంగా నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు ఈ ఏడాది ఏప్రిల్ 27 నుంచీ మే 6 వరకు ఆదోనిలో జరుగుతాయని చెప్పారు.

నాటక రంగానికి శ్రీనివాసులు సేవలు చిరస్మరణీయం

విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య



ఎస్ శ్రీనివాసులు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కళాకారులు

కర్నూలు(కల్చరల్), మార్చి 24: జిల్లా నాటక రంగానికి ఎస్ శ్రీనివాసులు చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య కొనియాడారు. శనివారం కర్నూలులో కన్నుమూసిన విశ్రాంత జడ్పీ సీఈఓ, సీనియర్ రంగస్థల కళాకరుడు ఎస్ శ్రీనివాసులు సంస్మరణ సభ ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రంగస్థల నటులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి నివాళులు అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గత యాభై సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న గొప్ప నటుడు, హార్మోనిస్టు ఎస్ శ్రీనివాసులు మరణం తీరని లోటు అన్నారు. శ్రీనివాసులు కుమారుడు నారాయణస్వామి పేద కళాకారులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, సీనియర్ నటుడు హెచ్ చంద్రన్న, బి. దస్తగిరి, క్రిష్టఫర్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగారెడ్డి, కళాకారులు గాండ్ల లక్ష్మన్న తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలరించిన 'అవ్వ అప్పచ్చి' సాంఘిక నాటకం...

నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెలా ప్రదర్శిస్తున్న సాంఘిక నాటకాల్లో భాగంగా ఆదివారం రాత్రి హైదరాబాదుకు చెందిన మురళి కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో పలువురు టీవీ కళాకారులు ప్రదర్శించిన 'అవ్వ అప్పచ్చి' సాంఘిక నాటకం ఆసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ నాటక ప్రదర్శనను విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరాయమ్య, ప్రముఖ వైద్యుడు డాక్టర్ మాల కొండయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీనియర్ రంగస్థల కళాకారులు మహ్మద్‌మియా, గాండ్ల లక్ష్మన్న, సంగా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన ఆర్థిక క్రిమినల్ : కోట్ల

- టీడీపీ కార్యకర్తల జోలికివస్తే అథఃపాతాళానికి తొక్కుతాం...
- మంత్రి బుగ్గన సమీప బంధువు సహా 400 మంది వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరిక

బేతంచెర్ల, మార్చి 24: బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కాదని.. ఆర్థిక క్రిమినల్ అని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సమీప బంధువు బుగ్గన ప్రభాకర్ రెడ్డి తన అనుచరవర్గంతో టీడీపీలో చేరారు. పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ 70 సంవత్సరాల నుంచి రాజకీయాలలో ఉన్న తమ కుటుంబం ఫ్యాక్షన్ రాజకీయాలను ఏనాడూ ప్రోత్సహించలేదన్నారు. కోట్ల, కేఈ కుటుంబాల ఘర్షణల వల్ల 200 కుటుంబాల్లో స్త్రీలు తమ భర్తలను పోగొట్టుకున్నారని బుగ్గన చేస్తున్న చెత్త ఆరోపణలను ఎవరూ నమ్మకూడదన్నారు. ఒకవేళ అదే జరిగినట్లు ఆయన నిరూపిస్తే తామంతా రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని బుగ్గనకు సవాల్ విసిరారు. బుగ్గన టీడీపీ కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే పాతాళానికి తొక్కుతామని హెచ్చరించారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన పదవిని అడ్డం పెట్టుకుని ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న అతిపెద్ద నేరస్థుడని అన్నారు. వేసిన రోడ్ల మీదనే రోడ్లు వేసి కమిషన్లు రాబట్టిన కమిషన్ల రారాజు అన్నారు. రానున్న ఎన్నికల్లో కమిషన్ల రాజుకు చిత్తుచిత్తుగా ఓడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన వారిలో పోలూరు రాఘవరెడ్డి, జనసేన నాయకులు మద్దిలేటి స్వామి, మధు, నాగరాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, నాయకులు బుగ్గన మహేశ్వరరెడ్డి, బుగ్గన సుధాకర్ రెడ్డి, బజాజ్ షోరూం రామిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కానాల శివారెడ్డి, కైప మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, చంద్రారెడ్డి, కానాల సుబ్బారెడ్డి, అంకిరెడ్డి, తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

స్వామి కథల్లో సీమ జీవన సారం

ప్రజాకవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

కర్నూలు(కల్చరల్), మార్చి 24: కరువు కాటకాల రాయలసీమ జీవన సారమంతా బండి నారాయణ స్వామి రాసిన కథల్లో ఉంటుందని ప్రముఖ ప్రజాకవి, గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాకు చెందిన బండి నారాయణ స్వామి 'మన సీమ కథలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గోరటి వెంకన్న ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమలో వేమన కాలం నుంచి సామాజిక స్పృహతో రాసిన కవులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. రాయలసీమలో తాండవిస్తున్న కరువు, వెనుకబాటుతనంపై ఉద్యమ స్ఫూర్తితో కథలు రాస్తున్న వారిలో బండి నారాయణ స్వామి ముందున్నారని ప్రశంసించారు. రాయలసీమ ఉద్యమంలో సీమ రచయితలు ముందున్నారని, సీమ ఉద్యమం ఇంకా బలోపేతం కావాలని అన్నారు. సీమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా అన్ని వర్గాలు కృషి చేయాలని కోరారు. పుస్తకావిష్కర్త, సీమ ఉద్యమకారుడు కానాపురం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీమలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం లభించాలంటే మళ్లీ రాయలసీమ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సీమ సాగునీటి ప్రణాళికా నిపుణుడు పాణ్యం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీమ చుట్టూ నదులు ఉన్నా, ఈ ప్రాంతం ఎడారిగా మారడానికి, నీటి ఎద్దడికి కారణం పాలకులేనని అన్నారు సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ ఎం. హరికిషన్ మాట్లాడుతూ సీమ అస్థిత్వంపై ఎందరో రచనలు చేసినా, బండి నారాయణస్వామి వంటి కథకులు అనేక ప్రాంతీయ సమస్యలను ముందుకు తెచ్చారని అన్నారు. కథా రచయిత బండి నారాయణస్వామి మాట్లాడుతూ సీమలో జరుగుతున్న ప్రజాస్వామిక ఉద్యమాలను కొన్ని పత్రికలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాల నుంచి రచయితలు నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ స్వామి తొలి దశ కథలకు, ప్రత్యేక రాయలసీమ ఉద్యమ నేపథ్యంలో రాసిన కథలకు వస్తు శిల్పాల్లో స్పష్టమైన తేడా ఉందని అన్నారు. మారుతి పౌరోహితం మాట్లాడుతూ రాయలసీమ రాజకీయార్థిక విషయాలు స్వామి కథల్లో ఉన్నాయని అన్నారు. ఈ సమావేశంలో రాయలసీమ సాగునీటి ప్రణాళికా నిపుణుడు పాణ్యం సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి. నాగార్జున రెడ్డి, సీమకృష్ణ, రవి కుమార్, పుల్లా రామాంజినేయులు, డాక్టర్ కె. చంద్రమౌళిని, కల్లం ప్రహ్లాద తదితరులు ప్రసంగించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న, కృష్ణారెడ్డి

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రోత్సాహం

- హెక్టారుకు రూ.21 వేల రాయితీ
- ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 24: ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు లాభదాయకం అని కర్నూలు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ పంట సాగు కోసం ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని ఇందులో భాగంగా సి. బెళగల్ మండలం కొత్తకోట గ్రామంలో రైతులు ఆయిల్‌ఫామ్ సాగుకు ముందుకు రాగా, వారికి ఉద్యానశాఖతో పాటు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సహకారంతో ఆర్థిక సహకారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట సాగుకు 13 మండలాల్లో 14 గ్రామాలు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించామని గోనెగండ్ల, బెళగల్, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, కర్నూలు, ఆదోని, హొళగుంద, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కర్నూలు, హాలహర్వి, క్రిష్ణగిరి మండలాల్లో ఈ పంట సాగుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు కొన్ని కంపెనీలకు దత్తత ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పతంజలి ఫుడ్ లిమిటెడ్ సంస్థకు సీ. బెళగల్, గోనెగండ్ల మండలాలు, నవభారత్ లిమిటెడ్ సంస్థకు క్రిష్ణగిరి, ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు మండలాలు, లివింగ్ ఫుడ్స్ సంస్థకు మంత్రాలయం, హొళగుంద, హాలహర్వి, కౌతాళం, కోసిగి, నందవరం, పెద్దకడుబూరు మండలాలను కేటాయించినట్లు ఏడీ రామాంజనేయులు తెలిపారు. ప్రస్తుతం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో సీ. బెళగల్ మండలంలో ఆయిల్‌ఫామ్ సాగుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఆయిల్‌ఫామ్ సాగు కోసం ప్రభుత్వం హెక్టారుకు రూ.21 వేల రాయితీని ఇస్తోందని తెలిపారు. ఏడాదికి రూ.5250 ప్రకారం నాలుగేళ్లు నేషనల్ మిషన్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ అండ్ ఆయిల్ ఫామ్ కేంద్ర సంస్థలు ఈ రాయితీని అందిస్తున్నట్లు స్పష్టం చేశారు.

కూలిన రథశాల ఇనుప షెట్టర్

మహానందిలో భక్తులకు తప్పిన ప్రమాదం



రథశాలలో కూలిన షట్టర్

మహానంది, మార్చి 24: మహానంది క్షేత్రంలో రథశాలకు ఉండే ఇనుప షెట్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో భక్తులకు పెను ప్రమాదం తప్పింది. మహాశివరాత్రి పర్వదినం తర్వాత క్షేత్రంలో 16 రోజుల పండుగను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాక రథానికి పూజలు చేసి రథశాలలోకి దాన్ని పంపారు. ఇంత వరకు కార్యక్రమం సజావుగా సాగింది. అయితే రథాన్ని లోపలికి పంపించాక సిబ్బంది ఇనుప షెట్టర్‌ను మూసివేస్తున్న సమయంలో షెట్టర్‌లోని కొంత భాగం ఊడి పడింది. ఆ సమయంలో భక్తులు అక్కడ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. రథశాలకు ఏర్పాటు చేసిన షెట్టర్ తుప్పు పట్టడం వల్ల విరిగి పడిందని ఆలయ అధికారులు తెలిపారు. త్వరలోనే షెట్టర్‌కు మరమ్మతు చేస్తామని ఆలయ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరు మృతి

నంద్యాల హైవేలో ఘటన





ప్రమాదంలో మృతి చెందిన రాజేశ్, ప్రసాద్‌రెడ్డి

నంద్యాల (రూరల్), మార్చి 24: నంద్యాల పట్టణ శివారులో ఆదివారం జరిగిన బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు చనిపోగా, మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి (45) నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నివసిస్తూ నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు బాలనాగయ్యతో కలిసి బైక్‌పై మసీదుపురానికి బయలుదేరాడు. ఇదే సమయంలో నంద్యాల గుడిపాటిగడ్డలో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్న ఉప్పు రాజేశ్ (25) తన స్నేహితుడి వెంకటసాయి సుధీర్‌తో కలిసి బైక్‌పై ఆళ్లగడ్డలోని ఓ పెళ్లికి హాజరయ్యాడు. తిరిగి ప్రయాణంలో నంద్యాల శివారు అయ్యలూరి మెట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ప్రసాద్‌రెడ్డి బైక్‌ను రాజేశ్ నడుపుతున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ప్రసాద్‌రెడ్డి, రాజేశ్, సుధీర్‌ను స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రసాద్‌రెడ్డి, రాజేశ్‌లు మృతి చెందగా, సుధీర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



క్రీడలను ప్రోత్సహించాలి



బెల్టులను ప్రదానం చేస్తున్న డా. శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్‌), మార్చి 24: పిల్లలు గంజాయి లాంటి మత్తు, మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండాలంటే తల్లిదండ్రులు తమ వారిని క్రీడల్లో ప్రోత్సహించాలని సీనియర్‌ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న షిరిడీ సాయినగర్‌లో ఉన్న మున్సిపల్‌ స్టేడియంలో మార్షల్‌ ఆర్ట్స్‌ శిక్షకుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరాటే బెల్ట్‌ గ్రేడింగ్‌ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

సభను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 27న వీరనారి ఐలమ్మ పేరుతో నూతనంగా నిర్మించిన వృత్తిదారుల సంఘం కార్యాలయం ప్రారంభాన్ని జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్‌ తెలిపారు. వృత్తిదారుల సమస్యలపై ఉద్యమాలు పోరాటాలు నిర్వహించడానికి కేంద్రంగా ఉంటుందని కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రారంభానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

చంద్రబాబును కలిసిన బ్రాహ్మణ సంఘం నాయకులు


చంద్రబాబుతో రామరాజు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: రాష్ట్ర బ్రాహ్మణ సమస్యలపై ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌. వెంకటరామరాజు టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడను కలిశారు. ఆదివారం తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో చంద్రబాబును కలిసి బ్రాహ్మణ సమస్యల పరిష్కారానికై మేనిఫెస్టోలో చేరుస్తామని హామీ ఇచ్చినట్లు రామరాజు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు యామిజాల నరసింహమూర్తి, దుర్గాప్రసాద్‌, శర్మ, యానామాంద్ర సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

హిమోఫీలియా బాధితులకు ఉచితంగా కిట్లు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: కర్నూలు చాప్టర్‌ హిమోఫీలియా సొసైటీ అధ్యక్షుడు ఆర్‌.పార్థసారథి ఆధ్వర్యంలో ఇంటాస్‌ ఫౌండేషన్‌ సహకారంతో హిమోఫీలియా బాధితులకు ఉచితంగా కిట్లను పంపిణీ చేశారు. ఆదివారం బుదవారపేటలోని కేశవ మెమోరియల్‌ ఇంగ్లీష పాఠశాల ఆవరణలో ఖరీదైన ఇన్హిబిటార్‌ స్క్రీనింగ్‌ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. జూనియర్‌ ఫిజియోథెరపిస్టు లోకేష్‌ హిమోఫీలియా ఇబ్బందులను అధిగమించి సాధారణ జీవితం గడపడానికి ఫిజియోథెరపీ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. మొత్తం 120 మంది హిమోఫీలియా బాధితులకు కిట్లు అందజేశారు. ఫ్యాక్టర్‌ 9 వారికి ఒక్కొక్కరికి 1200 యూనిట్ల ఇంజక్షన్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంటాస్‌ ఫౌండేషన్‌ ప్రాజెక్టు అసోసియేట్‌ కే. రామునాయుడు, కౌన్సిలర్‌ సీహెచ్‌.రామక్రిష్ణ, కేసీహెచ్‌.నాగరాజు, బాధితులు పాల్గొన్నారు.

‘మీటర్‌ రీడర్లను ఉద్యోగులుగా గుర్తించాలి’



మాట్లాడుతున్న యూనియన్‌ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలకాశి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: విద్యుత్‌ మీటర్‌ రీడర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ విద్యుత్‌ మీటర్‌ రీడర్స్‌ యూనియన్‌ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాలకాశి అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్క్రో అకౌంట్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. మూడు డిస్కంలలో కుదించిన పనిదినాలను పెంచాలని డిమాండ్‌ చేశారు. పీస్‌ రేట్లు పెంచడంతో పాటు రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌, జిల్లా కార్యదర్శి మునెప్ప, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి, ప్రధాన కార్యదర్శి సుంకయ్య, యూనియన్‌ రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా నీటి సరఫరా

కర్నూలు(న్యూసిటీ), మార్చి 24: నగర పాలక సంస్థ పరిధిలోని కొన్ని ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని, మరమ్మత్తులు పూర్తి చేయడంతో యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని కమిషనర్‌ ఏ.భార్గవతేజ ఆదివారం తెలిపారు. గత రెండు రోజులుగా 500 ఎంఎం డయా ఎంఎస్‌ పైప్‌లైన్‌ మరమ్మతులు విజయవంతం పూర్తి చేశామన్నారు. ఓల్డు కల్లూరు, క్రిష్ణానగర్‌, కొత్తబస్టాండు, జంపాల శివయ్యనగర్‌, తిలక్‌నగర్‌, చలావారి వీధుల్లో నీటి సరఫరా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సహకరించిన ప్రజలకు, సిబ్బందికి ఆయన దన్యవాదములు తెలిపారు.

‘బస్తిపాటి నాగరాజును గెలిపిస్తాం’


కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజును సన్మానిస్తున్న పెంచికలపాడు టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 24: కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును భారీ మెజారిటీతో గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని పెంచికలపాడు టీడీపీ నాయకులు కర్ణం చిన్న గిడ్డయ్య, ఎంపీటీసీ మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ కృష్ణ అన్నారు. ఆదివారం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామానికి కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు రాగ పెంచికలపాడు నాయకులు ఘన స్వాగతం పలికి పూలమాలలతో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యుగంధర్‌, నాగేష్‌, చంద్రశేఖర్‌, గోపాల్‌, సుంకన్న మధు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు (రూరల్‌): టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే జిల్లాలో పెండింగ్‌ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని బస్తిపాటి నాగరాజు తెలిపారు. ఆదివారం కోడుమూరు మీదుగా కర్నూలు వెళ్తుండగా ప్యాలకుర్తి గ్రామ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లుయాదవ్‌, రాఘవేంద్రయాదవ్‌, రంగన్నయాదవ్‌, రమేష్‌, మాజీ సర్పంచ్‌ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చలేని నాయకులను నిలదీయండి

- టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం
- టీజీ భరోసా యాత్రలో టీజీ భరత్‌


టీజీ భరత్‌ భరోసా యాత్రలో టీజీ భరత్‌

కర్నూలు(అర్బన్‌), మార్చి 24: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌ అన్నారు. ఆదివారం నగరంలోని 45. 46 వార్డుల్లో టీజీ భరత్‌ భరోసా యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఉమాదేవి ఆసుపత్రి నుంచి యాత్రను ప్రారంభించారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు. అభివృద్ధి గురించి వివరిస్తూ కరప్రతాలు పంపిణీ చేశారు. కర్నూల్లో ఉన్న పరిస్థితులను గుర్తించి స్వయంగా రూపొందించిన ఆరు గ్యారెంటీల కరపత్రాలు అందజేశారు. కర్నూలు నగరంలో సమస్యలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రజలు ఆలోచించి సరైన వ్యక్తికి ఓటు చేయాలని కోరారు. కార్యక్రమంలో 45 వ వార్డు సీనియర్‌ నాయకులు సుంకన్న, వీరశైవ లింగాయత్‌ రాష్ట్ర నాయకులు శివరాజ్‌, రవి, ప్రభాకర్‌, నాగరాజు, రాయుడు, 46వ వార్డు నాయకులు సంజీవలక్ష్మి, రాజ్‌ కుమార్‌ . మధుబాబు, డీష్‌ బాషా, రాజ్‌ కుమార్‌, ప్రదీప్‌, నరసింహులు, శ్రీనివాసులు, వరాలు, లక్ష్మిదేవీ,సీనియర్‌ నాయకులు, బూత్‌ ఇంచార్జీలు, జనసేన నాయకులు పవన్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్‌ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్‌

- మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత


టీడీపీలో చేరిన నన్నూరు వైసీపీ వైసీపీ

ఓర్వకల్లు, మార్చి 24: ఆంధ్రప్రదేశ్‌ను సీఎం జగన్‌ గంజాయాంధ్రప్రదేశ్‌, డ్రగ్‌ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ నంద్యాల అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌ విమర్శించారు. ఆదివారం మండలంలోని నన్నూరు గ్రామంలో వైసీపీ నుంచి 40 కుటుంబాలు గ్రామ టీడీపీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. నన్నూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శ్రీరెడ్డి మనోహర్‌ రెడ్డి, శ్రీపతి బొజ్జప్ప, శ్రీపతి సునీల్‌ కుమార్‌, శేఖరప్ప, నాసీర్‌ హుశేన్‌, అయ్యన్న, జగన్నాథం, సోమన్న, రిటైర్డు ఏఎస్‌ఐ ప్రతాప్‌, చాకలి శివల చెందిన 40 కుటుంబాలకు గౌరు చరితమ్మ, వెంకటరెడ్డి, రాజశేఖర్‌లు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయంలో పెట్టుబడుల ఆకర్షణలో నంబర్‌ వన్‌గా ఉన్న ఏపీని సీఎం జగన్‌ గంజాయి, డ్రగ్‌ రవాణాలో నంబర్‌ 1 స్థానానికి చేర్చాడని విమర్శించారు. విశాఖపట్నంను స్టేట్‌ క్యాపిటల్‌గా మారుస్తామని చెప్పిన జగన్‌ డ్రగ్‌ క్యాపిటల్‌గా మార్చారని దుయ్యబట్టారు. కల్తీ మద్యం మాఫియాతో ఇన్నాళ్లు ప్రజల ఇళ్లు, ఒళ్లు గుల్లయ్యాయని విమర్శించారు. ఎన్నికల్లో సైకిల్‌ గుర్తుకు ఓటు వేసి, వేయించి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, మండల కన్వీనర్‌ గోవిందరెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, మోహన్‌ రెడ్డి, చదువుల సుధాకర్‌ రెడ్డి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, రామాంజనేయులు, పుసులూరు ప్రభాకర్‌ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌ యాదవ్‌, ఖాజామియా, విజయుడు, షంషుద్దీన్‌, సర్కార్‌, సర్దార్‌, రామకోటేశ్వరరావు, మహబూబ్‌బాషా, కేవీ మధు తదితరులు పాల్గొన్నారు.

తడకనపల్లెలో వైసీపీకి ఝులక్‌...

- గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరుతున్న 36వ వార్డు వైసీపీ నాయకులు

కల్లూరు, మార్చి 24: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలోకి భారీగా వలసల పర్వం కొనసాగుతోంది. కల్లూరు మండలంలో ఆదివారం తడకనపల్లె టీడీపీ సర్పంచు సహరాబీ, కురువ పెద్ద రాముడు, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో 130 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గౌరు దంపతులు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

● గౌరు దంపతుల సమక్షంలో 400 మంది టీడీపీలో చేరిన: కల్లూరు అర్బన్‌ 36వ వార్డు డ్రైవర్స్‌కాలనీ, రాజీవ్‌గృహకల్పలో వార్డు ఇన్‌చార్జ్‌ రెడ్డిగారి తిరుమలేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 400 కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. గౌరు దంపతులు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం..

కల్లూరు, మార్చి 24: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 29వ వార్డు సూర్యనారాయణస్వామి ఆలయం సమీపంలో ప్రజల సమస్యలను తెలుసుకుని శంఖారావం సూపర్‌సిక్స్‌ పథకాల కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వైసీపీని గద్దెదించాలని, రానున్న ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్‌ కె.శ్రీనివాసరావు, వీరేంద్ర, రామకృష్ణ, పుల్లయ్యగౌడ్‌, జనసేన నాయకుడు షబ్బీర్‌ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి జైలుకువెళ్లడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి


బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కల్లూరు, మార్చి 24: మరికొద్ది రోజుల్లో జగన్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్‌ ఎన్టీఆర్‌ బిల్డింగ్‌లో నంద్యాల పార్లమెంట్‌ మహిళా అధ్యక్షురాలు కె. పార్వతమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమానికి బైరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌ విధ్వంసకరమైన పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేశారన్నారు. చంద్రబాబు సీఎం కాగానే జగన్‌ దోచుకని దాచుకున్నదంతా ప్రజలకు పంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మందుల శివ, జనార్దన్‌ ఆచారి, నాగేశ్వరరావు, మల్లెల పుల్లారెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం వేడుకలు


వర్కూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కర్నూలు(కల్చరల్‌), మార్చి 24: క్రైస్తవులు ఈస్టర్‌ వేడుక ముందు వచ్చే ఆదివారం నిర్వహించే మట్టల ఆదివారం (పామ్‌ సండే) వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. నగరంలోని వివిధ చర్చిలలో మట్టల ఆదివారం సందేశాలను మత పెద్దలు అందజేశారు. చిన్నారులు ఈత మట్టలకు రంగురంగుల కాగితాలు చుట్టి, అందంగా ముస్తాబు చేసి, వాటిని చేతుల్లో పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు.

కోడుమూరు (రూరల్‌): మండలంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువకులు ఈత చెట్టు కొమ్మలను చేతపట్టి వీధులలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యంగా వర్కూరు, ప్యాలకుర్తి గ్రామాల్లో ఏబీఎం చర్చి నుంచి దేవుని పాటలు పాడుతూ ర్యాలీగా బయలుదేరారు. కార్యక్రమంలో పాస్టర్లు రవికుమార్‌, రాజ్‌కుమార్‌ దేవుని స్తోత్రములు ఉన్నారు.

సి. బెళగల్‌: మండల మండలంలోని కంబంధహల్‌, పలుకుదొడ్డి, పోలకల్లు, మారందొడ్డి, కొత్తకోట, ముడుమాల, ఇనగండ్ల, సంగాల, తిమ్మనదొడ్డి, చింతమానుపల్లె, బురాన్‌దొడ్డి, ఈర్లదిన్నె, శింగవరం గ్రామాలలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని జరుపుకున్నారు. గ్రామ పుర వీధులలో ఈతమట్టలు పట్టుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం

- పాలకొట్టాలలో టీజీ భరత్‌


టీజీ భరత్‌ సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

కర్నూలు(అర్బన్‌), మార్చి 24: ఐదేళ్లలో కర్నూలు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌ అన్నారు. ఆదివారం నగరంలోని పాలకొట్టాలలో యువకులు టీడీపీలో చేరారు. టీజీ భరత్‌ మాట్లాడుతూ వైసీపీ నాయకులు కనీసం పారిశుధ్య పనులు కూడా చేయలేక చేతులు ఎత్తేశారన్నారు. ప్రజలు అభివృద్ధి చేసే వ్యక్తికి ఓటు వేయాలని కోరారు. తనకు ఇంత వరకు ప్రజలకు సేవే చేసే అవకాశం రాలేదని, ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే కర్నూలు అభివృద్ధి ఏంటో చూపిస్తానన్నారు. పార్టీలోచేరిన వారిలో ప్రసాద్‌, రాము, శివకుమార్‌, శేషిరెడ్డి, సాయి, శ్రీను ఉన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీనాయకులు సంజీవలక్ష్మి, సుంకన్న, శివరాజ్‌, రేఖాగౌడ్‌, పవన్‌, లక్ష్మిదేవీ, ఉమన్న, మహేష్‌, మధు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించండి: బొగ్గుల దస్తగిరి


సంతోష్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్‌)మార్చి24: రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వైసీపీని సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు అర్బన్‌ మండల పరిధిలోని సంతోష్‌నగర్‌, విజయలక్ష్మీనగర్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌ సిక్స్‌ పథకాలను బొగ్గుల దస్తగిరి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో అరాచకం, దౌర్జన్యాలతో సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బంటి, ప్రవీణ్‌, చింటు, సూరి, చాంద్‌, సుభాన్‌ తదితరులు పాల్గొన్నారు.

- కర్నూలు రూరల్‌ మండలం బి. తాండ్రపాడు గ్రామంలో అక్కడి ప్రజల ఆహ్వానం మేరకు బొగ్గుల దస్తగిరి పలు చర్చిలను సందర్శించారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు పూల రామకృష్ణ, యేసు, మోహన్‌ జోన్‌ రాముడు, కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.
- కర్నూలు రూరల్‌ మండలం బి. తాండ్రపాడు గ్రామ సర్పంచు ఆకెపోగు జయన్న ఆధ్వర్యంలో జనసేనా కార్యకర్తలు టీడీపీకి మద్దతు తెలుపుతు విష్ణువర్ధన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బొగ్గుల దస్తగిరిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు ప్రకటించారు.
- స్టాంటన్‌పురం పరిధిలోని కొండారెడ్డినగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు మధు ఆధ్వర్యంలో దాదాపు 60 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. వారికి విష్ణువర్ధన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- కర్నూలు రూరల్‌ మండలం ఈ. తాండ్రపాడు గ్రామ టీడీపీ సీనియర్‌ నాయకులు సత్యనారాయణ యాదవ్‌, పి. కిశోర్‌కుమార్‌, డి.కిశోర్‌ కుమార్‌ ఆధ్వర్యంలో 8మంది వార్డు సభ్యులు శీలన్న, బెస్త పద్మావతి, మెరునీసా, మద్దిలేటి, దస్తగిరి,భాగ్యలక్ష్మీ, గంగారావు,భానుమతితో పాటు బూత్‌ కమిటీ సభ్యులు శ్రీరాములు, వెంగన్న, బాలక్రిష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకటలక్ష్మీ మరో 60కుటుంబాలు టీడీపీ సీనియర్‌నేత ఎదురూరు విష్ణువర్దన్‌రెడ్డిని కలిసి పూలమాల వేసి శాలువతో ఘనంగా సత్కరించారు.

క్షయ నిర్మూలనకు పాటుపడదాం

కర్నూలు(హాస్పిటల్‌), మార్చి 24: క్షయ వ్యాధి నిర్మూలనకు చేయి చేయి కలుపుదామని డీఎంహెచ్‌వో డాక్టర్‌ వై.ప్రవీణ్‌ కుమార్‌, జిల్లా టీబీ ఆఫీసర్‌ డా.ఎల్‌. భాస్కర్‌ పిలుపునిచ్చారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్‌ లెక్చర్‌ గ్యాలరీలో ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో క్షయ వ్యాధి క్రమంగా తగ్గుతున్నదని అన్నారు. దీన్ని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చునన్నారు. జిల్లాలో 5881కి పైగా టీబీ కేసులు ఉన్నాయని, వీటికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. అనంతరం క్షయ వ్యాధిపై వైద్యవిద్యను అభ్యసిస్తున్న వైద్య విద్యార్థులకు, నర్సింగ్‌ విద్యార్థులకు, పీజీ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్‌ పోటీల్లో విజేతలకు వారు బహుమతులు అందజేశారు. అలాగే క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉత్తమ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్‌, ఫల్మనాలజీ విభాగాల హెచ్‌వోడీలు డా. విజయానందబాబు, డా. శ్రీకాంత్‌, ఫల్మనాలజీ రిటైర్డు ప్రొఫెసర్‌ డా.శైలజ, సేవా భారతి సంస్థ అధ్యక్షుడు ఫల్మనాలజిస్టు డా.సి. శ్రీనివాసరెడ్డి, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్‌ పృథ్వి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కురువలకు టీడీపీ ఎంపీ సీటుతో ప్రాధాన్యం

- కృతజ్ఞతలు తెలిపిన సంఘం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న కురువ సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్‌), మార్చి 24: టీడీపీ కర్నూలు పార్లమెంట్‌ సీటు బస్తిపాటి నాగరాజుకు కేటాయించడం హర్షనీయమని కురువ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్‌ పరమేష్‌, కురువ సంఘం నగర అధ్యక్షులు తౌడు శ్రీనివాసులు, విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్ల యల్లప్ప ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటు కూడా కేటాయించకుండా, కురువలను చిన్న చూపు చూసే విధంగా సజ్జల మాట్లాడడం ఆయన అజ్ఞానానికే వదిలేస్తున్నామన్నారు. చంద్రబాబు కురువలను గుర్తించి ఎంపీ సీటు కేటాయించారని, ఆదే విధంగా ఉమ్మడి జిల్లాలో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమవేశంలో మదాసు మాదాపూర్‌ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు తిరుమలేష్‌, రాష్ట్ర కురువ సంఘం కార్యదర్శి నాగలాపురం శ్రీనివాసులు, గోనెగండ్ల కురువ సంఘం నాయకులు మాదరి, కురువ సంఘ, నాయకులు రాముడు, శివయ్య, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షులు డీ. జేమ్స్‌, ధనుంజయ్‌, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల భూదాహానికి కుటుంబం బలి

ఓర్వకల్లు, మార్చి 24: వైసీపీ నేతల భూదాహానికి ఓ నిరుపేద కుటుంబం బలైందని, నిందితులను కఠినంగా శిక్షించాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితమ్మ, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌ అన్నారు. ఆదివారం నన్నూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో ఓ కుటుంబం తమ మూడెకరాల పొలం అమ్ముదామంటే రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేసి శ్రావణి అనే మహిళ పేరుతో ఆ భూమి ఉందని చెప్పారని అన్నారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు మనస్తాపానికి గురయ్యారన్నారు. రెవెన్యూ అధికారులు మోసం చేశారంటూ సూసైడ్‌ నోటు రాసి ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఈ ఆత్మహత్యకు కారణమైన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో నాయకులు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు: భూహక్కు చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్‌రెడ్డి కుట్రపన్నారని, రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తన స్వగృహంలో ఆమె సమావేశం నిర్వహించారు. గౌరుచరిత మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం కొత్త మాదవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన 3ఎకరాల భూమిని వైసీపీ నాయకులు లాక్కోవడంతో మొత్తం కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడటం చూస్తే ప్రజల ఆస్తులు ఏవిధంగా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని తెలిపారు. మన ఆస్తులకు రక్షణ కావాలంటే చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని గౌరుచరిత స్పష్టం చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(అర్బన్‌), మార్చి 24: ఒంటిమిట్టలో ఆత్మహత్యకు పాల్పడ్డ చేనేత కుటుంబానికి చెందిన పాల సుబ్బారావు ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాయలసీమ ప్రాతీయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోంకతి లక్ష్మినారాయణ డిమాండ్‌ చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తిరుపతి-కర్నూలు ఎక్స్‌ప్రెస్‌ వేలో 3 ఎకరాల భూమిని ఆక్రమించిన వైసీపీ నాయకులైన గంగ పేరూరు సర్పంచి కట్ట నారాయణ, మాజీ జడ్పీటీసీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌ నాగమురళి తరచూ సుబ్బారావుతో గోడవ పడతూ ఇబ్బందులకు గురి చేసేవారని తెలిపారు. తన భూమిని కబ్జా చేశారని పలు మార్లు రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా అధికారులు స్పందించకపోవడంతోనే ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఈ సంఘనలకు కారకులైన ద్రోహులను కఠినంగా శిక్షించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ప్రజల ఆస్తులను లాక్కునేందుకు జగన్‌ కుట్ర

కర్నూలు(అర్బన్‌), మార్చి 24: ల్యాండ్‌ లైటింగ్‌ పేరుతో చట్టం చేస్తూ ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి సొంత జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి జగన్‌రెడ్డి చేసిన చట్టమే కారణమన్నారు. ఈ ఘటనతోనైనా రాష్ట్రంలో బీసీలు మేలుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమాచార హక్కు చట్టం.. ప్రతి ఒక్కరికీ ఆయుధం

- కర్నూలులో ప్రాంతీయ సదస్సులో చైర్మన్‌


మాట్లాడుతున్న కంచర్ల సురేష్‌

కర్నూలు(అర్బన్‌), మార్చి 24: సమాచార హక్కు చట్టం ప్రతి ఒక్కరికి ఆయుదంగా పని చేస్తుందని న్యాయ పోరాట సమన్వయ కమిటీ చైర్మన్‌ కంచర్ల సురేష్‌ అన్నారు. ఆదివారం నగరంలోని కాస్మో పాలిటన్‌ కల్చర్‌లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రాంతీయ వర్క్‌ షాపు న్విహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లడమే ఏజెండేగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్‌ కార్యాలయాల్లో ఎలాంటి అవినీతి జరిగినా, ఎంతటి వారైనా సరే వారిపై మన సమాచార హక్కు చట్ట న్యాయం పోరాట సమన్వయ కమిటీ పంజా విసురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సహయ కార్యాదర్శి వీఎం కిరణ్‌ కుమార్‌, ఉమ్మడి తెలుగురాష్ట్రాల ఇంచార్జీ బైరెడ్డి దినేష్‌ కుమార్‌ రెడ్డి, జాతీయ అధ్యక్షులు బాలాజీ శంకర్‌ సింగ్‌, ప్రధాన కార్యదర్శి గరిక పాటి చంద్రకుమార్‌, రాష్ట్ర అధ్యక్షులు మునిగేటీ కాశీ, తెలంగాణ ఆధ్యక్షులు బండిప్రభాకర్‌, బోయ శ్రీనివాసులు, చామర్తి సుమవల్లీ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీని కలిసిన కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళి

కర్నూలు(అర్బన్‌), మార్చి 24: జిల్లా కాంగ్రెస్‌ కమిటి అధ్యక్షులు కే. బాబురావును కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీ కృష్ణ కలిశారు. ఆదివారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్‌ పార్టీకి చేరుకుని జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని లోటస్‌ పాండ్‌లో వైఎస్‌ షర్మిలా సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో డీసీసీ గౌరవాధ్యక్షులు ఉండవల్లి వెంకటన్న, జిల్లా కోఆర్డినేషన్‌ కమిటీ చైర్మన్‌ అనంతరత్నం మాదిగ, సీటి మైనార్టీ సెల్‌ ఆధ్యక్షులు షేక్‌ ఖాజా హుస్సేన్‌ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సహకరించండి: ఈవో


ఎండిపోయిన హంద్రీనదిని పరిశీలిస్తున్న ఆలయ ఈవో గుర్రెడ్డి

కోడుమూరు (రూరల్‌), మార్చి 24: గోరంట్ల లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలకు అందరూ సహకరించాలని ఆలయ ఈవో గుర్రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రసిద్ధ లక్ష్మీమాధవుడి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు రానున్నారని తెలిపారు. ఈ ఏడాది తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడడంతో హంద్రీనది ఒట్టిపోయిందన్నారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో హంద్రీకి నీటిని విడుదల చేశారని చెప్పారు. ఆదివారం సాయంత్రం వర్కూరు సుద్దవాగు వద్ద హంద్రీకి నీటి విడుదలను ఈవో గుర్రెడ్డి పరిశీలించారు.

- మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దర్శించుకున్నారు. సుజాతమ్మ స్వామిఅమ్మవార్లకు నామార్చన, పుష్ప, కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామి అమ్మవార్ల శేషవస్త్రం, ఫల, మంత్రాక్షలు అందించి ఆశీర్వచనాలు పలికారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా మట్టల ఆదివారం



మొలగవల్లి కొట్టాల చర్చిలో మట్టల ప్రదర్శనలో క్రైస్తవులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 24 : జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదోని ఎస్కేడీ కాలనీ సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చి, విక్టోరియా పేట సీఎస్ఐ క్రైస్ట్ చర్చి, రాయనగర్ ఎంబీ చర్చితో పాటు మరికొన్ని క్రైస్తవ మందిరాలలో పిల్లలు, యువత ఈత మట్టలను చేతపట్టుకొని వీధులలో ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ పాస్టర్ ఎస్ భాస్కర్ బాబు, రెవరెండ్ పాస్టర్ విలియం సుజిత్ మాట్లాడుతూ యేసు క్రీస్తు ఈ లోకానికి మానవ రూపంలో వచ్చి మరణించారని అన్నారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు. సంఘ కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్, ట్రెజరర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలూరు : ఆలూరు సీఎస్ఐ, మొలగవల్లి కొట్టాల చర్చిల్లో మట్టల ఆదివారం నిర్వహించి ఈత మట్టలతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు రెవరెండ్ పుసైల కుమార్, సంఘ పెద్దలు దేవపుత్ర ఆశీర్వాదం, దాసప్ప రాజు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఆలూరు, మార్చి 24 : స్థానిక ఏపీ మోడల్ కాలేజీలో 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈ నెల 28 నుంచి మే నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాఘవరామ్ ఆదివారం తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాలన్నారు. పదవ తరగతి మార్కుల మెరిట్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు ఎంపిక జరుగుతుందన్నారు.

నేటి నుంచి ప్రవచన కార్యక్రమం

ఆదోని టౌన్, మార్చి 24: మహాయోగి లక్ష్మమ్మ ఆధ్యాత్మిక కేంద్రంలో 25వ తేదీ సోమవారం నుంచి ప్రవచన కార్యక్రమాన్ని ప్రతిరోజు నిర్వహించనున్నట్లు లక్ష్మమ్మ అవ్వ టౌన్ బ్యాంక్ సీఈవో గట్టు మురళీకుమార్ ఆదివారం తెలిపారు. రామాయణానికి సంబంధించిన ప్రవచన కార్యక్రమాన్ని ప్రముఖ పండితులు సుస్వరం నాగరాజు సాయంత్రం 6:30 నుంచి నిర్వహిస్తారని, అందరూ పాల్గొనాలని కోరారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 24 : ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులకు గురైన ఉపాధ్యాయులను, గర్భిణులను, చంటి పిల్లల తల్లులైన ఉపాధ్యాయినిలను మినహాయించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పునరాలోచించి ఆర్డర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు మహాదేవప్ప, సుంకన్న, రామాంజనేయులు, సుధాకర్ బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మన్మథ రథోత్సవం

● కామదహనం అనంతర హోళీ సంబరాలు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 24 : ఆదోని పట్టణంలోని కిల్చినపేట అంబాభవాని దేవాలయంలో శనివారం అర్ధరాత్రి మన్మథ స్వాముల రథోత్సవం వైభవంగా జరిగింది. ఐదు రోజులపాటు మన్మథుడు, శివపార్వతుల విగ్రహాలు కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అంబారిపై చిన్నారులను రథోత్సవం ముందు ఊరేగింపుగా చేశారు. వేకువజామున 4.30 నిమిషాలకు మన్మథులకు కళ్యాణోత్సవాన్ని వేదపండితుల చేత సాంప్రదాయబద్ధంగా, కన్నుల పండుగగా జరిపించారు. ఆదివారం ఉదయం కామదహనాన్ని చేపట్టి శివపార్వతులను గంగాపావనం చేశారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోళీ సంబరాలు జరుపుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు

ఆదోని, మార్చి 24 : శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ గోపినాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రత్యేక పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. యువత సోషల్ మీడియా మాధ్యమాలలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఘనంగా ఇమాంసాహెబ్ షంషీర్

మద్దికెర, మార్చి 24: మద్దికెర గ్రామ శివారులో ఉన్న గ్రామంలో ఇమామ్‌సాహెబ్ ఉరుసు ఉత్సవాలు కులమతాలకు అతీతంగా ఘనంగా జరిగాయి. ఆదివారం ఇమామ్‌సాహెబ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున స్వామివారి ప్రతిమను గుర్రంలో పెట్టి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇమామ్‌సాహెబ్ ప్రతిమకు గుర్రం కాలికి నిండుకడువ నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దర్గాలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నభోంపల్లిలో తాగునీటి ఇక్కట్లు



చిన్నభోంపల్లిలో తాగునీటి ట్యాంకు వద్ద తాగునీటి కోసం పడిగాపులు

కోసిగి, మార్చి 24: మండల పరిధిలోని చిన్నభోంపల్లి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో తాగునీటి బోరు ఒక్కటే ఉంది. ఉదయం నుంచి పనులు మానుకుని తాగునీటి కోసం ట్యాంకుల దగ్గర ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నీటి బోర్లు ఉన్నా అవి తాగడానికి పనికి రావడం లేదని, గ్రామంలో ఉన్న ఒకే ఒక్క బోరు తాగడానికి పనికి వస్తుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మరో రెండు తాగునీటి బోర్లు వేయిస్తే నీటి సమస్య కొద్దిగా తీరుతుందని వాపోయారు.

కురువ వర్గాన్ని గుర్తించిన చంద్రబాబు



పంచలింగాల నాగరాజును సన్మానిస్తున్న కురువ సంఘ నాయకులు

ఆలూరు, మార్చి 24 : కురువ సామాజిక వర్గాన్ని గుర్తించి పంచలింగాల నాగరాజును కర్నూలు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు కురువ వర్గం అండగా ఉంటుందని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్‌లు కురువ జయరామ్, శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగల నాగరాజును ఆలూరు కురువ సంఘం నాయకులు కలిసి సన్మానించారు. నాగరాజును భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు

వైసీపీని గద్దె దింపడమే ధ్యేయం

● పార్లమెంట్ స్థానంతోపాటు అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయం

● కర్నూలు ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు



పత్తికొండలో మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు

పత్తికొండ , మార్చి 24 : రాష్ట్రంలో అరాచక పాలనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే ధ్యేయమని టీడీపీ కర్నూలు పార్లమెంటరీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు అన్నారు. ఆదివారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఆయన జడ్పీ మాజీ చైర్మన్ బత్తిని వెంకటరాముడుతో కలసి విలేకర్లతో మాట్లాడారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించింది టీడీపీ పార్టీనేనని, కర్నూలు ఎంపీ సీటును కురువలకు కేటాయించడమే నిదర్శనమని పేర్కొన్నారు. అన్నివర్గాలను కలుపుకొని ముందుకు సాగుతామని, ఎంపీ సీటుతోపాటు అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతనం ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్ని రకాలుగా వెనుబడ్డ కర్నూలు పార్లమెంట్ సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్‌చౌదరి, రామానాయుడు, చల్లారవి, జయరాముడు, దేవేంద్రప్ప, హోటల్ శ్రీనివాసులు, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజును గెలిపించుకుంటాం

ఆదోని, మార్చి 24 : టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజును పార్టీలకు అతీతంగా కురువలు గెలిపించుకుంటామని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నాయకులు బత్తిన లక్ష్మీ నారాయణ, తెలుగు యువత రాష్ట్ర నాయకులు బత్తిన కుబేర్‌నాథ్, కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేంద్రప్ప అన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు బత్తిన లక్ష్మీనారాయణను ఆయన స్వగృహంలో కలిసి మాట్లాడారు. టీడీపీ నాయకులు కురువ జయరాం, శ్రీనివాసులు, కురువ కులస్తులు పాల్గొన్నారు.

టీడీపీ తోనే బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి

గోనెగండ్ల: టీడీపీతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆయన మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా తమ ఓటును వినియోగించుకొని బీసీ అభ్యర్థి అయిన తనను, ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు బేతాలబడేసా, జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, డాక్టర్ మిన్నల్ల, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతలకు ఏం సమాధానం చెబుతారు : బీవీ



కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 24: వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి కడప జిల్లాలో ఓ చేనేత కుటుంబం బలైందని, దీనికి సీఎం జగన్‌రెడ్డి ఏమి సమాధానం చెబుతారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. కబ్జారాయుళ్లతో పోరాడలేక బీసీ కుటుంబం ప్రాణాలు తీసుకుందని, ఇది మాటలకందని విషాదమని, ప్రతి ఒక్కరినీ ఆందోళనలో పడేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కుటుంబం ఎంత వేదనకు గురై ఉంటే ప్రాణాలు తీసుకొని ఉంటారో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. సీఎం సొంత జిల్లాలో జరిగిన సంఘటనపై జగన్ తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

చేనేత కుటుంబానికి కొవ్వొత్తులతో నివాళి: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం లో ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి పట్టణ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో చేనేత విభాగం నాయకులు మల్లికార్జున, మిన్నప్ప, దేవేంద్రప్ప, నరసింహులు, పట్టా నాగరాజు, లక్ష్మన్న, కామార్తి మహేష్‌లతో పాటు పలువురు ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబ సభ్యుల ఫ్లెక్సీలకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించడంతో పాటు సుబ్బారావు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజల స్థిరాస్తులను లాక్కుంటున్నారు :కేఈ

● వైసీపీ పాలనలో ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణలేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

వెల్దుర్తి, మార్చి, 24: ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో రాష్ట్రంలో ప్రజల స్థిరాస్తులను లాక్కుంటూ ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తున్నారని టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ.శ్యాంబాబు అన్నారు. ఆదివారం రత్నపల్లె, యాదరాళ్ల, సర్పరాజపురం, రామళ్లకోట గ్రామాలలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. రామళ్లకోటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్యాంబాబు మాట్లాడారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన మూడెకరాల భూమి వైసీపీ నాయకులు లాక్కోవడంతో కుటుంబమంతా ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. పౌరుల హక్కుల్ని కాలరాస్తూ ల్యాండ్ టైటిల్ యాక్టును రెవిన్యూ అధికారులకు సివిల్ కోర్టు అధికారాలు కట్టబెట్టాడన్నారు. ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్ మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకున్న జగన్‌రెడ్డి ప్రజల స్థిరాస్తులపై పడ్డారన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ఇతరుల పేర్లను టైటిల్ రిజిస్టర్లలో ఎక్కిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డిని రాబోయేఎన్నికల్లో ఓడించకపోతే ప్రజల ఆస్తులు ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, రామయ్య, రామకృష్ణ ఆచారి, అన్నసూరీడు, కృష్ణ, ఆనంద్, చంద్రన్న, రాముడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29 నుంచి మహా సమారాధనోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మఠం మేనేజర్

మంత్రాలయం, మార్చి 24: రాఘవేంద్రస్వామి పూర్వ మఠాధిపతి, మంత్రాలయం నవ నిర్మాణకర్త సుయతీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు ఈ నెల 29న ప్రారంభమవుతున్నట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ప్రస్తుత పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు పీఠమిచ్చిన గురువు సుయతీంద్రతీర్థుల ఈ నెల 29న పూర్వారాధన, 30న మధ్యారాధన, 31న ఉత్తరాధనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో పీఠాధిపతి ఆధ్వర్యంలో సుయతీంద్రతీర్థులకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నారు. 30న మధ్యారాధన పురస్కరించుకుని బృందావనానికి ప్రత్యేక అభిషేకాలు చేసి బంగారు రథంపై ఊరేగించనున్నారు. యాగ మండపంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి సుయతీంద్రతీర్థుల 2024 అవార్డులను పీఠాధిపతి చేతుల మీదుగా ప్రదానం చేయనున్నారు.

అమ్మ కనిపించడం లేదని ఫిర్యాదు



లక్ష్మమ్మ (ఫైల్ ఫొటో)

ఆదోని రూరల్, మార్చి 24 : అమ్మ కనిపించడం లేదంటూ కొడుకు కృష్ణ ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన 70 సంవత్సరాల వయస్సు కలిగిన లక్ష్మమ్మ తన కొడుకు కృష్ణ, కోడలు పుష్పతో కలిసి ఉంటోంది. ఈ నెల 14న అత్త లక్ష్మమ్మ, కోడలు పుష్ప మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయింది. గుర్తించిన కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లతోపాటు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కొడుకు కృష్ణ తాలుక పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

టీడీపీ హయాంలోనే కార్పొరేషన్ల ఏర్పాటు

తుగ్గలి, మార్చి 24: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పేదలందరికీ రుణాలు అందించి ప్రతి కుటుంబాన్ని ఆదుకున్నది చంద్రబాబే అని రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. ఆదివారం అమరావతిలో టీడీపీ అధినేత చంద్రబాబును తుగ్గలి నాగేంద్ర కలిసి టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని, పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కేఈ శ్యాంబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని మీకు కానుకను ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ మహా కూటమితో ముందుకు వెళ్తుందని, రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

దేవనకొండ, మార్చి 24: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి గ్రామ పంచాయతీ సిబ్బంది తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. స్థానిక సీఎల్ఆర్‌సీ భవనం వద్ద గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందడంతో స్థానిక పోలీసులు మృతుని వివరాల కోసం ప్రయత్నించినప్పటికీ ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అనాథ వ్యక్తిగా గుర్తించారు. మృతుని వద్ద ఎలాంటి వివరాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేయడంతో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

త్వరలో వైసీపీ రౌడీ రాజ్యం కూలిపోతుంది

● మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 24: వైసీపీ రౌడీరాజ్యం మరి కొన్ని రోజుల్లో కూలిపోతుందని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు రాజ్యం అని చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం రైతులను నిలువునా దోచేస్తూ ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీసీ, బడుగు, బలహీన వర్గాల కోసం టీడీపీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తే జగన్ రౌడీయిజంతో పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త మాధవరంలో జరిగిన సుబ్బారవు కుటుంబం మరణానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం జరిగేంత వరకు టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్టారెడ్డి, రాకేష్‌రెడ్డి, కౌలుట్లయ్య, బొజ్జప్ప, కేశన్న పాల్గొన్నారు.

రంగనాథునికి విరాళంగా వెండి పాదాలు

మద్దికెర, మార్చి 24: మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథ స్వామికి గ్రామానికి చెందిన శేషం రంగన్న వెండి పాదుకలను విరాళంగా అందజేశారు. ఆదివారం గ్రామానికి చెందిన శేషం రంగన్న స్వామివారికి సమర్పించే వెండి పాదుకలను ఊరేగింపుగా తీసుకుని వచ్చి దేవాలయ చైర్మన్ దస్తగిరిగౌడు, ఆలయ ప్రధాన అర్చకులు రంగనాథ స్వామికి అందజేశారు. శేషం రంగన్నచే ఆలయంలో పూజలు చేయించారు.

రేపే రాతిదూలం పోటీలు

తుగ్గలి, మార్చి 24: పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ నెల 26న అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని లంకాయపల్లిలో వారు మాట్లాడుతూ ఆరుపల్ల విభాగంలో రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.30వేలు దాత అమర్నాథ్ రెడ్డి, రెండో బహుమతిని రూ.20వేలు దాత సుల్తాన్, మూడో బహుమతిని రూ.15వేలును దాతలు బొబ్బిలి రామాంజనేయులు, రమేష్, నాల్గవ బహుమతిని రూ.10వేలను దాత టీడీపీ నాయకులు లింగన్నతో పాటు, 5వ, 6వ బహుమతులు అందజేస్తున్నామన్నారు.

27న దూదేకొండ గ్రామ దేవర

పత్తికొండ , మార్చి 24 : పత్తికొండ మండల పరిధిలోని దూదేకొండ దుర్గాదేవి, సుకాలనాగమ్మల గ్రామదేవర ఈనెల 26, 27 వతేదీలలో నిర్వహిస్తామని గ్రామ నాయకులు తెలిపారు. 26వ తేదీ అర్ధరాత్రి పోతుబలి కార్యక్రమం, 27వ తేదీ బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

లంకావాహనంపై రంగనాథస్వామి దర్శనం

మద్దికెర, మార్చి 24: మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగనాథుడు లంకావాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అర్చకులు పంపిణీ చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవుడికే శఠగోపం పెట్టిన వైసీపీ నాయకుడు

● విరాళం పేరుతో దేవుడి రథాన్ని అమ్ముకున్న వైనం

● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 24: రాజన్న రాజ్యం అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డు.. అదుపులేకుండా పోయింది. అవినీతి, అక్రమాలు, భూకబ్జాలతో పాటు దౌర్జన్యాలు, దాడులేగాక ఏకంగా దేవుళ్లకు సైతం శఠగోపం పెట్టేందుకు వెనుకాడడంలేదు.. ఆదాయం వస్తుందంటే చాలు దేవుడైతే ఎంతా.. అనే స్థాయిలో వైసీపీ నాయకులు పెట్రేగిపోతున్నారు. ఇలాంటి సంఘటనే మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ ప్రజల ఆరాధ్యదైవంగా పూజించే స్వామివారి రథాన్ని విరాళం పేరుతో గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు అమ్ముకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు గ్రామంలోని దేవాలయంలో ఉన్న రథంపై కన్నేశాడు. దేవాలయానికి రథం అవసరంలేదన్న కారణంతో రథాన్ని విరాళంగా ఇచ్చామన్న పేరుతో గోనెగండ్ల మండలంలోని ఓ గ్రామం వారికి విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని దేవాలయ అభివృద్ధి పాటు పడాల్సిన వైసీపీ నాయకులే దేవాలయానికి సంబంధించిన రథాన్ని అమ్ముకొని సొమ్ముచేసుకోవడంతో గ్రామ ప్రజలు ఆవైసీపీ నాయకుడి ఆగడాలపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడికి ఓ ప్రముఖ ప్రజాప్రతినిధితో మంచి సంబంధాలు ఉండడం వల్లనే ఆయన ఆగడాలకు అడ్డు.. అదుపులేకుండా పోయిందన్న విమర్శలు బలంగా వినబడుతున్నాయి. ఇప్పటికైనా దేవదాయశాఖ అధికారులు స్పందించి దేవాలయానికి చెందిన రథాన్ని తిరిగి దేవాలయంకు చేర్చేలా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన మంత్రాలయం



మంత్రాలయం మంతం ప్రాగంణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, మార్చి 24: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. అది, సోమవారం సెలవు దినాలు కావటంతో ఆంధ్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలు, హోటల్‌లు, పూజా సామాగ్రికి డిమాండ్ పెరిగింది.

సంక్షిప్త సమాచారం

గ్రామ చావిడిని పడగొడితే సహించం...

మద్దికెర, మార్చి 24: చందాలు పోగు చేసుకుని గ్రామ సేవకులంతా కలిసి భవనాన్ని నిర్మించుకున్నామని, పంచాయతీవారు గ్రామ చావిడిని కూలగొడితే సహించేది లేదని గ్రామ సేవకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక మెయిన్‌బజారులో కూరగాయల మార్కెట్ సముదాయం కోసం గ్రామ చావిడిని కూలగొడతారన్న సమాచారం తెలుసుకొని గ్రామ సేవకులు గ్రామ చావిడికి అడ్డుగా నిలబడి ఆందోళన చేశారు. గ్రామ సేవకులు సుంకన్న, శేఖర్ మాట్లాడుతూ పంచాయతీ వారికి గ్రామ చావిడి కూలగొట్టే అధికారం లేదన్నారు. పంచాయతీకి ఆదాయం కావాలంటే గ్రామంలో ఎంతో విలువైన స్థలాలు ఆక్రమించారని, అవి ఖాళీ చేయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సేవకులు మస్తాన్, కోదండ, మారుతి, సుంకన్న తదితరులు ఉన్నారు.

కూలిన మట్టి మిద్దె..

మద్దికెర, మార్చి 24: గ్రామంలోని బెస్త వీధిలో నివసించే కొనగారి ఈశ్వరయ్య, తిప్పమ్మ దంపతులకు చెందిన మట్టి మిద్దె ఉన్న ఫలంగా కూలిపోయింది. ఆదివారం ఈశ్వరయ్య, తిప్పమ్మ, కొడుకు, కూతురు తమ సమీప బంధువుల గృహ ప్రవేశం ఉండటంతో వేరే గ్రామానికి ఉదయం 9 గంటల ప్రాంతంలో వెళ్లారు. వారు వెళ్లిన కొద్దిసేపటికే ఉన్న పలంగా మట్టిమిద్దె కుప్పకూలింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇంట్లోని తినుబండారాలు, సామాన్లు, ధ్వంసమయ్యాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనల అమలు కష్టంగా ఉంది

పత్తికొండ , మార్చి 24 : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా హోసూరు గ్రామంలో నేతల చిత్రపటాలకు అతికించిన పేపర్లు చించివేస్తున్నారని, సున్నం కొడితే నీటితో కడిగేస్తున్నారని, ఇక్కడ పని చేయలేకపోతున్నానని వీఆర్వో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు గ్రూపులలో షేర్ కావడంతో వైరల్‌గా మారింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటలలోగా ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయనేతల చిత్రాలను, ఫ్లెక్సీలను తొలగించాలని ఎన్నికల సంఘం అదేశాలు జారీచేసింది. నిబంధనల్లో భాగంగా సిబ్బంది గ్రామగ్రామాన నేతల చిత్రపటాలు, విగ్రహాలు కనిపించకుండా బట్టలుకట్టి, పేపర్లు అతికించారు. హోసూరు వీఆర్వోకు ఈ విషయంలో వింత అనుభవం ఎదురైంది. కాగా ఇలా ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రామలక్ష్మి హెచ్చరించారు.

మూడు బాటిల్స్ కంటే ఎక్కువ ఇవ్వొద్దు



మద్యం దుకాణంలో సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ చంద్రహాస్

ఎమ్మిగనూరు, మార్చి 24: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఒక వ్యక్తికి మూడు మద్యం బాటిల్స్ కంటే ఎక్కువ ఇవ్వరాదని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ సూచించారు. ఆదివారం ఎక్సైజ్ సూపరండెంట్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు.. పట్టణంలోని శివసర్కిల్‌లో ఉన్న మద్యం దుకాణం దగ్గర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల ముందు ఎలాంటి ఘర్షణలు జరగకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖతారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ చంద్‌బాషా పాల్గొన్నారు.

ముళ్లపొదలు దగ్ధం

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 24: కలుగొట్ల గ్రామ సమీపంలోని వంక దగ్గర ఉన్న ముళ్లపొదలు నిప్పురాజుకొని దగ్ధమయ్యాయి. ఆదివారం మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పును రేపడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ముళ్లపొదల పక్కనే గడ్డివాములు ఉండడంతో గ్రామస్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

వైసీపీకి బుద్ధి చెబుదాం

తుగ్గలి, మార్చి 24: ఐదేళ్ల రాక్షస పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెబుదామని మాజీ సర్పంచు వీరభద్రప్ప, టీడీపీ నాయకులు తలారి రాముడు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగనాయునిదొడ్డి, పెండేకల్ గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఇకపై ఎవరూ కూడా కేసులకు భయపడవద్దని, నిర్భయంగా బయటకు వచ్చి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు, నాయుడు, మల్లికార్జున, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.